రాజేశ్వరి

శ్రీ బూర్గుల రంగనాథరావుగారు

ఉత్తరం చూడగానే రాజేశ్వరికి కళ్లనీళ్లు తిరిగాయి. 'ఎక్కణ్ణుంచి' అని హాల్లో మూగిఉన్న మిత్రులు అడిగినా చెప్పక, కిటికీలోనుంచి వీధిలోకి చూస్తున్నట్టు నటించి, కళ్లనీళ్లు తుడుచుకుని, విచారాన్నంతా బలవంతంగా మింగేసి, చిరునవ్వు తెచ్చుకుని, స్నేహితులతో 'ఈరోజు నేను మా అప్పయింటికెళ్లాలె. సాయంత్రం బహుశా మనం కలుసుకోలేమేమో!' అంది.

'మళ్లీ యెప్పుడు దర్శనం?'

'మీరిప్పుడు వెళ్లక తప్పదా?'

'పిక్చరు ప్రోగ్రాం వేశాంగా?'

'సరె! మీ యిష్టం.'

ఈ ప్రశ్నలన్నిటికీ 'టీ తాగి వెళ్లండి' అని మాత్రం జవాబు. టీ తాగి ఒక్కొక్కరే వెళ్ళిపోయారు. ప్రకాశం కొంచెం అందరికన్నా ఆలస్యంచేసి, 'నా కారులో దిగబెడతాను' అన్నాడు.

'అక్కర్లేదు...థాంక్స్...దయదలిస్తే కారు వదిలి వెళ్లండి. రేపు ప్రొద్దున్నే...' నోరుతెరిస్తే చాలు ఏదంటే అది చేసే ప్రకాశం అర్ధోక్తిలోనే, 'పరవాలేదు; తీసుకెళ్లండి' అని మందహాసంతో ఆశాపూరితమైన నమస్కారంచేసి వెళ్లిపొయ్యాడు. అమావాస్య చంద్రుణ్ణి వదిలివెళ్లిన నక్షత్రాల్లా మిత్రులందరూ వెళ్లాక, వేగుచుక్క ప్రకాశం గూడా కదలిపోయాడు.

ఇంకెవరూ తనను వేధించకండా రాజేశ్వరి తలుపేసి, సోఫాలో పడుకొని మళ్లీ ఓమారు ఉత్తరం చదువుకుంది. ఉత్తరంకన్న, ఉత్తరాన్ని వ్రాసిన రమాకాంతం పేరు ఆమె ఊహాధునికి ఆవేగం కలిగించింది. కాలేజిరోజులు కలలో మెదిలినట్టు కనులకు కట్టాయి. ఇంకొహప్పుడైతే యిదే ఉత్తరాన్ని పదిమార్లు—కాని అసహ్యదృష్టితో అపహాస్యంకోసం—చదివేదేమో కాని యిప్పటి తనస్నేహితుల వైఖరి, తనకు జరుగుతున్న కృత్రిమ సన్మానాలు, దుర్భరమైన ఈ నాలుగేళ్ళ జీవితంలో తానుచేసిన ఘోరాలు, ఈ ఉత్తరంచే పెల్లగింపబడి, త్రవ్వితీసిన తలపుట్టలవలె జుగుప్సాకరంగా దుర్భరంగా కనపడ్డాయి. రమాకాంతంయొక్క ఏకాగ్రత, ప్రేమ, తనపై ఆశ, ముఖ్యంగా అతని చిన్నయీడు గొప్పహృదయం, ఆమెలో ఒకవిధమైన మానసిక విప్లవం కలిగించాయి............

ఎంత వద్దన్నా ఆ కాలేజి రోజులు, అప్పటి చర్యలు జ్ఞాపకం వస్తున్నాయి. తన పార్టీలో ఓ అరడజను స్నేహితులు; స్త్రీలు - పురుషులు. అందరూ ధనవంతులూ రూపవంతులే. అంతా తనను ఆరాధించి 'ప్రేమించి' పొగడేవాళ్లే! ప్రతివాడూ 'నమస్కారమండీ' అని ఓ మందహాసపుష్పం అర్పించుకోవడమే...ఇదంతా యెందుకని? తనకు అందం, తెలివి ఉన్నాయి గనక! క్లాసులో అగ్రస్థానం తనకే!

బహుమానాలు, సన్మానపత్రాలు, విందులూ, పూలహారాలు అన్నీ తనకే!! కాని తానుమాత్రం ధనవంతులైన ఏ కొద్దిమందితోనో యెక్కువగా తిరగడం, వాళ్ళ కార్లల్లో, సోఫాలల్లో తన సౌందర్యాన్ని రాచివేయడం......మరి రమాకాంతం యేంచేశాడు? తమంతా కలిసి పోతూంటే, ఎక్కడో ఫర్లాంగు దూరాన్నుంచి జాలిగా అనుసరిస్తూ దీనదృష్టుల్తో, తెగిపోయిన గాలిపటాన్ని అనుసరించే వీధికుఱ్ఱాడిలాగ, తిరిగేవాడు. ఒక్కమారైనా - 'స్త్రీ హృదయం'తో కాకపోతే మానవహృదయంలోనైనా అతడిని చూసిందా?...

'ఇప్పుడు అసలు తనను ఎవరైనా ప్రేమిస్తున్నారా?' అంటే, తన హృదయంలోనుంచి 'లేదు! అంతా దుర్మార్గులు! అప్పుడు విద్యార్థులు, యువకులు. ఇప్పుడు ఉద్యోగులు, గృహస్థులు. తనలో యింకా యేమయినా యవ్వనం, సౌందర్యం ఉంటే పీల్చేసి ఎన్నటికైనా పవిత్రప్రేమకొఱకు వీటిని దక్కకుండా చేతామని వచ్చేవాళ్లే' అని బదులు వస్తుంది.

తనభర్త యెక్కడో పిచ్చివాడై వ్యర్థుడై పడిఉన్నాడు—ఏదో దుర్విధివల్ల అలాంటి చిన్నతనపు 'వివాహం' జరిగింది. కాని కొన్ని పరిస్థితులు తనను పట్నం కొట్టుకొచ్చాయి. తండ్రీ మామగారు పశ్చాత్తాపపడి కళ్లుతెరచి యిప్పటికైనా మునిగిపోలేదని ఉన్నతవిద్య చెప్పించారు. ఇంట్లో ఉంచుకుని చదువుచెప్పించిన తన మేనమామ పోగానే డబ్బున్న స్నేహితుల సహాయంమీద స్వేచ్ఛగా ఉండిపోయింది. బంధువులందరినీ యెదిరించి, ఒక్కడూ వివాహం చేసుకోడు. అందరికీ 'లీగల్ ఆబ్జక్షనే'.

కాని యిప్పటికీ తరగకుండా మరవకుండా ప్రేమించిన రమాకాంతంలాటి మనిషి—కాదు; ప్రాణం ఉన్నమనిషికన్న నిశ్చలంగా నిర్మలంగా ఉన్న పర్వతం—తనకు యెక్కడ దొరుకుతుంది?

నిశ్చయించుకుంది; అప్పుడే ప్రయాణానికి ప్రకాశంకార్లో. ఒక దాసీదాన్నిమాత్రం వెంట తీసుకుని స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ బయలుదేరింది, పాకాల తాలూకాలోని రమాకాంతం గ్రామానికి. ఈ గ్రామానికి నాలుగుమైళ్ల దూరంలో ఉన్న రామప్పగుళ్ల ముందరికి రాగానే రాజేశ్వరి హృదయంలో ఒక మెరుపుమెరిసింది. అది పశ్చాత్తాప మేఘాల రాపిడివల్లనే కావచ్చు. లేదా దుఃఖోద్రేక ఫలితమే కావచ్చు. లేదా, నమ్మితే, ఆధ్యాత్మిక సంచలనం అనవచ్చు. ఆ గుళ్లయొక్క పురాతన శిల్పసౌందర్యం, దివ్యమైన గాంభీర్య పవిత్రతలు అవేవో నిశ్శబ్దంగా ప్రతిధ్వనించాయి...కారు ఆపింది. శుభ్రంగా ప్రక్కన ఉన్న చిన్న చెరువులో స్నానంచేసి తెల్లచీరకట్టుకుంది—ఆమె పిచ్చికాకపోతే, చలువచీరైనా నీళ్లలో పిండి కట్టుకోవడమెందుకు? మడికొరకేమో?—చెవులకు ఆ పొడుగుపాటి లోలకులులేవు. కాళ్లకు ఎత్తు మడిమల జోళ్లు లేవు. పౌడరు, రూజ్, లిప్‌స్టిక్, ఏవీలేవు. మెళ్లో ఒకేవరుస చౌకరకపు ముత్యాలహారం (తండ్రి కొనిచ్చింది పెళ్లికాక పూర్వం) ఉంది. అదొక్కటే తనది, అమాయకంగా వచ్చింది. స్వయంగా గన్నేరుపూలు కొన్ని పట్టుకొని ఒక గుడిలోకివెళ్లింది. ఆ రాళ్లకూ అస్పష్టంగా ఆడుకుంటున్న ఆలలకూ, తలపై యెగిరిపోయే రాబందులకు, రాజేశ్వరి వైఖరి యెంత అర్థమౌతుందో ఆ దాసీదానికీ అంతే అర్థమైంది. 'మాట్లాడకుండా వెళ్లి కార్లో కూర్చో' అని చెప్పే రాజేశ్వరి చూపులను తెలిసికోక, 'ఏం ఖర్మం? పిచ్చెత్తిందా?' అనుకుని, అడుగులో అడుగువేసుకుంటూ అర్ధనిమీలిత నేత్రాలతో మౌనంగా ప్రార్థనచేస్తూ నడుస్తున్న ఆమెవెనకాలే, తానూ నడిచింది దాసీది. క్షణంలో రాతివిగ్రహం ముందర రాజేశ్వరి విగ్రహం

నిలుచుంది. దేనికేది ప్రతిబింబమో? రెంటి శిల్పం ఒకేతీరుగా ఉంది. అయితే విగ్రహం నల్లరాయి. ఈమె శరీరం వెన్నెలపోగు. ఈమె కళ్లుమూసుకుంది ధ్యానంలో. విగ్రహం కళ్లుతెరచింది. ధ్యానాన్ని అభినందిస్తున్నట్టుగా ఉంది. 'ఈమెను సృష్టించిన ప్రకృతి చాతుర్యం, ఆ రాతిని చెక్కిన వడ్డెవాని శిల్ప విద్యాప్రౌఢి ఒకేతీరుగ యెలా ఉన్నా' యంటే, అదే 'శిల్పం' అని అనవల్సివస్తుంది. నాల్గోక్లాసులో చదివి మరచిన చంద్రమతి, దమయంతి, సావిత్రి మొదలగువారి కథలు సద్యః శ్రుతులు (Sudden Revelation)గా పొడసూపాయేమో కాని, ఆమె భావాలు, వేషం, తెల్లచీరమీద నమ్రతతో వంగిఉన్న నల్లని వెంట్రుకలూ, అన్నీ పవిత్రాలు ప్రతిబింబాలుగా ఉన్నాయి. ఆమెలోని ఉచితజ్ఞత, పరివర్తన రమాకాంతుని పదపద్మం వద్దకే ఈడ్చుకపోయ్యాయి.

రాజేశ్వరి యెంతసేపు ధ్యానించిందో కాని విగ్రహంపాదాలు పట్టుక పడిపోయింది...అరగంట గంట అయింది, లేవదు. సూర్యాస్తమయం కావస్తున్నది. దాసీది భయంచే వణికిపోయింది. ఊళ్లోకి వెళ్తే? ఒక్కర్తే రాజేశ్వరిని ఈ స్థితిలో విడిచి ఎట్లా వెళ్లుతుంది? వెళ్లకుంటే ఎంతసేపో మూర్ఛ...ఇంకేమైనా అయితే? వైద్యుడు, ఏమైనాతిండికి సహాయం, కావాలె...పరిగెత్తింది ఊరివైపు.

అదే సమయానికి...

వచ్చేస్తున్నాడు అడవికి, రమాకాంతం, ఒక్కమారు పట్నంవెళ్లి రాజేశ్వరిని మనసారాచూసి వీలైతే మాట్లాడి తరువాత తన నిశ్చయాన్ని పూర్తిచేసుకోవాలని. దాసీది యెవరో సహాయానికి సమయానికి కనుపడ్డారుగదా అని అడిగింది 'ఈ ఊళ్లో వైద్యునియిల్లు యెక్కడుంది స్వామీ?'

'ఆ సర్వేశ్వరుడే పెద్ద వైద్యుడు' అంటూ ముందుకు పోసాగాడు.

'అయ్యా త్వరగాచెప్పండి. ఏమైనా సహాయంచెయ్యండి. ఇక్కడ మా దొరసాని గుళ్లో పడిపోయింది' అని అతన్ని అర్థంచేసుకునే ప్రయత్నం చెయ్యకే తిరిగి ప్రశ్నించింది.

'ఈ దొరసాన్ల కింతేకావాలి'. నిలువకుండా చర చర వెళ్లాడు.

ఊరివైపు వెళ్లిందామె ఆశ్చర్యంతో యితనివైపు చూస్తూ. కొంచము ముందుకుపొయ్యాక రమాకాంతంకు రోడ్డుమీద కారు కనుపడింది. ఆ కారు ప్రకాశందని తాను బాగా యెరుగును. అంతాకలిసి యిక్కడికే పిక్నిక్కి వచ్చారో? కాని తోవలో తనకు కనుపడిన వ్యక్తి 'గుళ్లో పడిపోయిం'దని యెందుకు చెప్పుతుంది? గుడిలోకి వెళ్లాడు. ప్రశాంతమయిన ముకుళిత నయనాలమీది విచారచ్ఛాయలనుగాని, మెడను కప్పేసిన జుట్టునుకాని చూడలేదు. భక్తిని, అమోఘమైన పరివర్తననూ, సూచించే ఒక తెల్లని ఆకారం మాత్రం మొదట కనుపడింది. అంతా అర్థమయిందతనికి. వెంటనే విగ్రహానికి నమస్కరించి, తరువాత తన జీవనాధారమైన రాజేశ్వరీ మూర్తికి ప్రణమిల్లాడు.

మెల్లగా ఆమెకళ్లను స్పృశిస్తూ 'రాజా' అన్నాడు రెండుమార్లు. ఊపిరి కొట్టుకుంటూనేఉంది. ఎలాగో చెరువు అంచుకు యెత్తుక పొయ్యాడామెను. దిగిపోతున్న సూర్యబింబం ఒక్కమారామె పాదాలను తాకి పూర్తిగా మునిగిపోయింది. మలుసంజ అరుణరాగం మాత్రం మందమారుతానికి, యిష్టంఉండీ లేక

ద్రోల్లే చిరుతరంగాలను చక్కిలిగింతలు పెడుతూ ఉంది. తెలివివచ్చేదానికి మొఖంమీద నీళ్లు చల్లడానికని కిందపడుకోబెట్టబోయి ఆమెను కిందపడేశాడు. అందమయిన అవయవాలు బరువుగా ఉంటాయని ఆ అబ్బాయి అనుకోలేదేమో! ఎడమచేయి భారం యెక్కువైంది. కుడిచేయిమీద ఆమెతల ఉంది. అంచేత యెత్తివేసినట్టయింది. ఆమె మెలకువకు అదేకారణం. కళ్లువిప్పి చూసింది. రాతివిగ్రహాంబవులు తన రమాకాంతం దగ్గిర కూర్చున్నాడు, చల్లనీళ్లతో తనమొహాన్ని తడుపుతూ... ఇద్దరూ ఉద్రిక్తులైయున్నారు. ఎవరు ఎవరిని ఎట్లాఅన్నా ఏమనుకుంటారో అనే అనుమానధూళి వారి నాశ్రయించలేదు; ఎట్లా సంబోధించాలనే శబ్దాన్వేషణంలేదు. ఆపనంతా వాళ్లచేతులు, కళ్లు, పెదవులే చేశాయి.

'ఇంకోమారు ప్రార్థనచేసి వెళ్దామా?' అంది రాజేశ్వరి.

'తప్పకుండా... నీతోకూడా ప్రార్థించి తరిస్తాను.'

....

ఇద్దరూ పరితృప్తహృదయులై పెదవులమీద చిరునవ్వు మొలకలెత్తగా, కళ్లల్లో దివ్యానందం చిందులాడగా, కార్లోయెక్కి కూర్చున్నారు. కారును ఊళ్లోకి పోనిచ్చింది. ఊరిబయట తనకోసం వైద్యుని తీసుకునివస్తున్న దాసీదాన్ని వైద్యుణ్ణి కూడా పిక్అప్ చేస్తూ రమాకాంతుని 'అమృతనివాస్'లోకి వెళ్లారు.

ఒకప్పుడు ఆరిస్టోక్రాటిక్ రాజేశ్వరి యిప్పుడు తన ఉన్నతవిద్యను సద్వినియోగం చేస్తూ ఆ ఊరికి సర్వవిధాల సేవచేస్తూన్నదని చెప్పడం అనవసరం.

అక్కడ ప్రకాశం 'ఎక్కడో సుఖంగా ఉండనీ. కాని పాపం కారును తిరిగిపంపక తనవద్దనే ఉంచుకొని ఉంటే బావుండేది'అని అనుకున్నాడు, కొంచెం ఫీల్ అవుతూ.

స్త్రీ హితైషిణీమండలి, బాపట్ల

భవన శంఖుస్థాపనము

స్త్రీ హితైషిణీమండలి భవన శంఖుస్థాపనము 7-11-41 తేదీ శుక్రవారం అత్యంత వైభవోపేతముగా జరుపబడినది.

ప్రథమమున యథాశాస్త్రీయముగా వాస్తుపూజాక్రమముగా జరిగిన తరువాత ఈ పురమునందలి సబ్‌జడ్జిగారగు మహారాజశ్రీ ఘూడభూషి రంగనాథాచార్యులవారి సతీమణియగు శ్రీమతి గుణవతీదేవిగారు వెండితాపీచే శంఖుస్థాపనము గావించి అచట సమావేశమైన స్త్రీల నుద్దేశించి స్త్రీ సమాజములకు భవన ముండినగాని అభివృద్ధినందుట కవకాశములేదనియు ఈ స్త్రీ హితైషిణీమండలివారు స్త్రీ సంఘమునకు చేయుచున్న సేవ అనిర్వచనీయమనియు మీరెల్లరు ఈ భవన నిర్మాణ కార్యమునకు తోడ్పడి అనతికాలములో భవనము తయారగునట్లు చూడవలెననియు చెప్పిరి. పిమ్మట శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు మండలి చరిత్రను వివరించి భవన నిర్మాణమునకు ఎల్లరు సహాయ మొనర్పవలెనని కోరిరి. శ్రీమతి గిడుగు లక్ష్మీకాంతమ్మగారి వందనములతో సభ సమాప్తమయ్యెను.